సాక్షి రాజన్న సిరిసిల్ల

బుధవారం : 23 : ఆగస్టు : 2023

థాంక్యూ సార్

కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యే అభ్యర్థులు మంగళవారం హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్‌ను కలిశారు. తమకు టికెట్లు కేటాయించినందుకు కృతజ్ఞతలు చెప్పారు. బొకేలు అందజేశారు. సీఎంను కలిసిన వారిలో మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి తదితరులు ఉన్నారు.



న్యూస్‌రీల్

రాజీయే రాజమార్గం



మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రేమలత

సిరిసిల్లటౌన్: రాజీమార్గమే రాజమార్గమని జిల్లా న్యాయమూర్తి ప్రేమలత అన్నారు. మంగళవారం కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్లో మాట్లాడారు. చాలా రోజులుగా పెండింగ్‌లో ఉంటున్న కేసుల సత్వర పరిష్కారం కోసం జిల్లా ప్రజలకు సెప్టెంబర్ 9న జరిగే జాతీయ లోక్ అదాలత్ ఒక మంచి అవకాశంగా పేర్కొన్నారు. రాజీ పడే అవకాశం ఉన్న ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, చిన్నపాటి ఆస్తి తదితర తగాదాల కేసుల కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. జిల్లా కోర్టు సూపరింటెండెంట్ వామన్‌రావు, మండల న్యాయసేవాసమితి సభ్యుడు చింతోజు భాస్కర్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

వేములవాడ: సెస్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు బుధవారం సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు సెస్ ఎండీ రామకృష్ణ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బోయిన్‌పల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో వేములవాడ సబ్ డివిజన్ పరిధిలోని వేములవాడ టౌన్, వేములవాడ రూరల్, కోనరావుపేట, చందుర్తి, బోయిన్‌పల్లి మండలాలకు చెందిన సెస్ వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. వినియోగదారులు సదావకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

బోయినపల్లి(చొప్పదండి): పదో తరగతిలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ రమేశ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని విలాసాగర్ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 8, 9వ తరగతి విద్యార్థులతో విద్యాబోధన ఎలా జరుగుతుందో తెలుసుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.రాజిరెడ్డి, ఉపాధ్యాయులు మధుసూదన్, వెంకటహనుమాన్, రాజిరెడ్డి, శోభారాణి, వసుంధర, రాధిక, శమంతకమణి ఉన్నారు.

అర్బన్‌బ్యాంకు చైర్మన్‌పై అవిశ్వాసం

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని అర్బన్‌బ్యాంకు చైర్మన్ గాజుల నారాయణ అవిశ్వాస తీర్మానాన్ని చవిచూడాల్సి వస్తుంది. సహకార చట్టం 1994 సెక్షన్ 34 సబ్ సెక్షన్ 2 ప్రకారం బ్యాంకు ఉపాధ్యక్షుడితో పాటు డైరెక్టర్లు అవిశ్వానికి సిద్ధమయ్యారు. నారాయణ కాలపరిమితి నాలుగేళ్లు పూర్తవడం, ఇన్ని రోజులుగా డైరెక్టర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, బ్యాంకులో సొంత నిర్ణయాలు అమలు చేస్తున్నందున తాము ఇబ్బందులు పడుతున్నామన్నారు. 12 మంది డైరెక్టర్లలో 9 మంది నారాయణపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని ఉపాధ్యక్షుడు గడ్డం విఠల్, డైరెక్టర్లు మందాడి శ్రీనివాస్‌రెడ్డి, కోడం సంజీవ్, స్వర్గం రాజు, అడ్డగట్ల శారద, అడిచెర్ల సాయికృష్ణ, ఆడెపు అనసూర్య, నేరెళ్ల శ్రీకాంత్, వేముల రాములు డీసీవోను కోరారు.

అక్కరకు రాని ఆస్తులు

- ఇల్లు అమ్మలేం.. జాగ కొనలేం
- సిరిసిల్ల కార్మికవాడల్లో కష్టాలు
- పట్టాలు ఇచ్చారు.. జీవో మరిచారు
- మోక్షం లేని సిరిసిల్ల పట్టాల కష్టాలు

‘జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్‌కు చెందిన మల్లేశం నేతకార్మికుడు. అతనికి 1988 ప్రాంతంలో 126 గజాల భూమి పట్టాను రెవెన్యూ అధికారులు ఇచ్చారు. ఆ స్థలంలో ఇల్లు కట్టుకున్నాడు. మల్లేశంకు ఇద్దరు కొడుకులు, ఒక్క కూతురు. కొడుకులు కూడా సాంచాలు నడుపుతున్నారు. కూతురు పెళ్లి కోసం రూ.5 లక్షల అప్పులు కావడంతో మల్లేశం ఇల్లు అమ్మేందుకు సిద్ధమయ్యాడు. కానీ ఆ ఇల్లు జాగ ప్రభుత్వ పట్టా కావడంతో రిజిస్ట్రేషన్ కావడం లేదు. ఇంటి నంబరు ఉన్నా.. పన్నులు చెల్లిస్తున్నా... ఆ ఇల్లు రిజిస్ట్రేషన్ కావడం లేదని ఎవరూ కొనేందుకు ముందుకురాలేదు.’



బీవై నగర్‌లో నివాసాలు

‘స్థానిక బీ.వై.నగర్‌కు చెందిన రాజేశం బీడీ కంపెనీ టేకేదార్. అతనికి అందమైన ఓ బిల్డింగ్ ఉంది. కార్మికవాడలో రాజేశందే మూడు అంతస్తుల భవనం. అతని కొడుకు వంశీ ఉన్నత చదువుల కోసం యూఎస్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. రూ.30 లక్షలు అవసరం ఉండడంతో రాజేశం ఆ ఇంటిని తాకట్టు పెట్టి బ్యాంకు రుణం తీసుకునేందుకు సిద్ధమయ్యాడు. కానీ ఏ బ్యాంకు వద్దకు వెళ్లినా ఇంటి డాక్యుమెంట్లు లేవని, మార్టిగేజ్ చేసుకునేందుకు ముందుకురాలేదు. నిజానికి ఆ ఇల్లు ధర రూ.70 లక్షలు. కానీ బ్యాంకులో రూపాయి అప్పు పుట్టని దుస్థితి.’ ఇలా ఒక్కరిద్దరు కాదు.. సిరిసిల్ల కార్మిక వాడల్లో వేలాది మంది సమస్య.

సిరిసిల్ల: మూడొంతస్తుల అందమైన భవంతులు.. మార్కెట్‌లో రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షలు విలువ చేసే బిల్డింగులు.. ఎన్ని ఉంటే ఏమి లాభం.. బ్యాంక్‌లో రుణం పుట్టడం లేదు. బిడ్డ లగ్గానికి చేసిన అప్పు కుప్పలవుతుండగా.. చేతికందిన కొడుకు పై చదువులు ఆగిపోతుండగా చూస్తూ ఏం చేయలేకపోతున్నారు. సిరిసిల్లలోని కార్మికకాలనీలైన బద్దం ఎల్లారెడ్డినగర్ (బీ.వై.నగర్), పుచ్చలపల్లి సుందరయ్యనగర్ (పీ.ఎస్.నగర్), తారకరామనగర్, పద్మనగర్, ఇందిరానగర్, రాజీవ్‌నగర్‌లో పట్టాలు పొందిన పేదలు అక్కరకు రాని ఆస్తులను చూస్తూ కన్నీరు పెడుతున్నారు.

రాయినిచెరువులో పట్టాలు

మూడున్నర దశాబ్దాల కిందట సిరిసిల్ల పట్టణాన్ని ఆనుకొని ఉన్న రాయిని చెరువును తొలగించి నిరుపేదలకు ఇళ్ల స్థలాలను పట్టాలుగా ఇచ్చారు. అప్పటి ఎమ్మెల్యే చెన్నమనేని రాజేశ్వర్‌రావు నేతకార్మికులకు పట్టాలు ఇప్పించారు. సిరిసిల్లలో సుమారు ఐదు వేల పట్టాల వరకు ఉన్నాయి. అప్పటి పట్టాదారులు తమ వారసులకు ఆ స్థలాలను అప్పగించారు. అప్పట్లో గుడిసెలు వేసిన స్థలాల్లో ఇప్పుడు పక్కా ఇళ్లు, భవనాలు వెలిశాయి. సాంచాల కార్ఖానాలు నిర్మించారు. కానీ కార్మికవాడల్లో ఇల్లు ఉన్నా.. జాగ ఉన్నా అది చెల్లని ఆస్తిగానే ఉండిపోతోంది.

మంత్రి కేటీఆర్ చొరవతో..

ప్రభుత్వ భూమిలో నివసించే వారికి హక్కులు కల్పించేందుకు ఉద్దేశించి 2015లో ప్రభుత్వం జారీ చేసిన జీవో 58, 59 సిరిసిల్లలోని కార్మికక్షేత్రంలో వర్తించలేదు. సిరిసిల్ల ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో నేతన్నల ప్రయోజనం కలిగించేందుకు 2018లో ఇంటింటి సర్వేలు చేయించారు. పొజిషన్‌లో ఉన్న 2,400 మందికి పట్టాలు అందించారు. పట్టాల్లో పేర్లు మారాయి కానీ క్రయవిక్రయాలకు అవకాశం లభించలేదు. ఫలితంగా దశాబ్దాలుగా పేదలు అక్కరకు రాని ఆస్తులతో అవస్థలు పడుతున్నారు.

పేదల చిరకాల వాంఛ

స్థానిక కార్మిక వాడల్లో పేదల చిరకాల వాంఛను తీర్చేందుకు మంత్రి కేటీఆర్ సైతం సుముఖంగా ఉన్నారు. ప్రభుత్వ భూముల్లో నివసించే వారికి చట్టబద్ధమైన హక్కులు కల్పిస్తే భవిష్యత్‌లో చిక్కులు వస్తాయని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. కానీ దీనిపై ఇటీవల కేబినెట్‌లోనూ చర్చ సాగింది. మంత్రి కేటీఆర్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక జీవో జారీ చేయిస్తామన్నారు. కానీ ఇప్పటి వరకు ఆ పేదల చిరకాల వాంఛ నెరవేరలేదు. ఇప్పటికైనా పేదలకు చట్టబద్ధహక్కులు కల్పిస్తే కార్మిక వాడల్లో క్రయ, విక్రయాలు పెరిగి, రిజిస్ట్రేషన్లు జరిగి ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుంది.

పేదలు సంతోషిస్తారు



సిరిసిల్లలో పేదలకు పట్టాలు ఇవ్వాలని మేం భూపోరాటం చేశాం. చెరువులో చాలా మందికి పట్టాలు వచ్చాయి. చట్టబద్ధమైన హక్కులు కల్పిస్తే.. ఆస్తికి విలువ పెరుగుతుంది. రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. పేదలు సంతోషిస్తారు. కార్మికవాడల్లో బహుముఖ ప్రయోజనం కలుగుతుంది.

– తవుటు కనకయ్య, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, సిరిసిల్ల

మంత్రి కేటీఆర్ కృషి చేస్తున్నారు



కార్మికవాడల్లో పట్టాలను క్రమబద్ధీకరించేందుకు మంత్రి కేటీఆర్ కృషి చేస్తున్నారు. అందరికీ గతంలో పట్టాలు అందించారు. క్రయ, విక్రయాలకు చట్టబద్ధమైన హక్కులను కల్పించే విధంగా, రిజిస్ట్రేషన్లు జరిగేలా ప్రత్యేక ఆర్డర్ ఇచ్చేలా కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తుంది. తొందరలోనే ఈ సమస్య పరిష్కారం అవుతుంది.

– జిందం కళాచక్రపాణి, మున్సిపల్ చైర్‌పర్సన్

ఒక్కరోజే రెండు లక్షల మొక్కలు నాటాలి

కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో 26వ తేదీన ఒక్క రోజే 2 లక్షల మొక్కలు నాటాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా అధికారులతో సమీక్షించారు. స్వాతంత్ర్య వజ్రోత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా జిల్లాలో మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో రైల్వేలైన్, ఆక్వాహబ్, 17వ పోలీస్ బెటాలియన్, రెండో బైపాస్ రోడ్డు నిర్మాణం, కొత్త చెరువు అభివృద్ధి, హైలెవల్ వంతెనలకు సంబంధించి భూసేకరణ పూర్తి చేయాలన్నారు. గృహలక్ష్మిలో అర్హులను పారదర్శకంగా ఎంపిక చేయాలని, పూరిగుడిసెల్లో ఉండే వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, ఎన్.ఖీమ్యానాయక్, ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, మధుసూదన్, గంగయ్య, జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, ఎస్టీ వెల్ఫేర్ ఆఫీసర్ జనార్దన్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

పోలింగ్ కేంద్రాల్లో వసతులు పరిశీలించాలి

జిల్లాలో 547 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిలో ఎన్నికల సంఘం నిర్దేశించిన వసతులను పరిశీలించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సెక్టోరియల్ అధికారులకు శిక్షణ జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటర్లుగా చేర్చాలన్నారు. ఇంటింటికీ తిరిగి ఓటర్ల జాబితాను రూపొందించాలన్నారు. మాస్టర్ ట్రైనర్లు మహేందర్‌రెడ్డి, ఎన్నికల విభాగం ఉప తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

• యువర్ అటెన్షన్ ప్లీజ్..

‘పెద్దపల్లి బైపాస్’కు లైన్ క్లియర్

- చీకురాయి-పెద్దబొంకూరు మధ్య కొత్త రైల్వేస్టేషన్ నిర్మాణానికి నిర్ణయం
- తొలుత ఎలక్ట్రిక్ లైన్‌కు టెండర్లు పిలిచిన దక్షిణ మధ్య రైల్వే
- భవిష్యత్తులో ముంబై, సికింద్రాబాద్‌లకు రైళ్ల సంఖ్య పెరిగే అవకాశం
- ఉమ్మడి కరీంనగర్‌వాసులకు మేలు



చీకురాయి వద్ద ట్రాక్‌లు కలిసే ప్రాంతం

సాక్షి ప్రతినిధి,కరీంనగర్: ఎన్నో దశాబ్దాలుగా కరీంనగర్ నుంచి హైదరాబాద్, ముంబై వంటి నగరాలకు రైలులో వెళ్లాలన్న పాత కరీంనగర్ వాసుల కల త్వరలో సాకారం కానుంది. ఇందుకోసం దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్-కాజీపేట-బల్లార్షా సెక్షన్‌ను పెద్దపల్లి-కరీంనగర్-ముంబై సెక్షన్ లైన్‌తో కలపనుంది. ఇటీవల పెద్దపల్లి-కరీంనగర్ మార్గాన్ని డబ్లింగ్ లైన్‌గా అప్‌గ్రేడ్ చేసేందుకు ముందుకు వచ్చిన దక్షిణ మధ్య రైల్వే తాజాగా.. కాజీపేట-బల్లార్షా, కరీంనగర్-పెద్దపల్లి లైన్లను కలపడం ద్వారా ఈ సెక్షన్‌లోని రైల్వే ప్రయాణంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టబోతోంది.

భూమి ఇచ్చేందుకు రైతుల అంగీకారం

పెద్దపల్లి జిల్లాలోని చీకురాయి-పెద్దబొంకూరు గ్రామాల మధ్య పెద్దపల్లి బైపాస్ పేరుతో కొత్త రైల్వే స్టేషన్ నిర్మించతలపెట్టారు. ఇందుకోసం ఇటీవల రెండు గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. దాదాపు 20 ఎకరాల వరకు భూమిని ఇచ్చేందుకు రైతులు అంగీకరించారు. వారికి పరిహారం ఇచ్చేందుకు దక్షిణ మధ్య రైల్వే ఏర్పాట్లు చేస్తోంది. రైల్వేస్టేషన్ నిర్మాణంలో భాగంగా ముందుగా ఎలక్ట్రిక్ లైన్ నిర్మించేందుకు ఇటీవల టెండర్లు పిలిచింది. త్వరలోనే స్టేషన్ నిర్మాణం కోసం టెండర్లు పిలవనుంది. చీకురాయి-పెద్దబొంకూరుల మధ్య పాయింట్‌ను వ్యూహాత్మకంగా ఎంపిక చేశారు. ఇది కాజీపేట-బల్లార్షా లైన్‌తో కరీంనగర్-పెద్దపల్లి లైన్ కలిసే ప్రాంతం. ఇంతకాలం ఒక రైలు కరీంనగర్ మీదుగా కాజీపేట/సికింద్రాబాద్ వైపు వెళ్లాలంటే ముందు పెద్దపల్లి జంక్షన్ చేరాలి. అక్కడ బోగీల ముందు ఉన్న ఇంజిన్ విడిపించుకొని, ముందుకు వెళ్లి మళ్లీ వెనక్కి వచ్చి కాజీపేట వైపు ఉన్న బోగీలను లింక్ చేసుకొని వెళ్లాల్సి వచ్చేది. కానీ, ఇప్పుడు పెద్దపల్లి బైపాస్ రైల్వేస్టేషన్ పూర్తయితే కాజీపేట వైపు వెళ్లే రైళ్లన్నీ కొత్త స్టేషన్ మీదుగా ఎలాంటి ఇంజిన్ మార్పులు అవసరం లేకుండా సాఫీగా సాగిపోతాయి. జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్‌వాసులకు కాజీపేట/వరంగల్/సికింద్రాబాద్ వైపు ప్రయాణం మరింత సులువు కానుంది.

గణనీయంగా పెరిగిన ఫ్రీక్వెన్సీ

కరోనాకు ముందు ఇది కేవలం సింగిల్ లైన్ మార్గం. నిజామాబాద్ వరకు కనెక్టివిటీ ఉండటం, ఈ మార్గాన్ని వందే భారత్ వంటి రైళ్లు సైతం నడిచేలా ఇటీవల 100 కి.మీ. వేగం తట్టుకునేలా ట్రాక్ సామర్థ్యం పెంచారు. గతంలో ఖాజీపేట-బల్లార్షా సెక్షన్‌లోని రైళ్లు సికింద్రాబాద్ మీదుగా మహారాష్ట్ర వెళ్లేవి. దీనివల్ల చాలా ఇంధనం, సమయం వృథా అయ్యేవి. ఈ మార్గం పూర్తి కావడంతో కరోనా కాలంలో పెద్దపల్లి-నిజామాబాద్ రూట్‌కు డిమాండ్ బాగా పెరిగింది. ప్రతీరోజు గ్రానైట్, బొగ్గు, బాయిల్డ్ రైస్, వ్యవసాయ ఉత్పత్తులు రవాణా చేసే రైళ్ల ఫ్రీక్వెన్సీ గతంలో ఎన్నడూ లేనంతగా గణనీయంగా పెరిగింది. ఫలితంగా దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో సరుకు రవాణా రైళ్ల ద్వారా అత్యధికంగా ఆదాయం తీసుకువచ్చే రైల్వే మార్గాల్లో పెద్దపల్లి-నిజామాబాద్ ఒకటిగా ఆవిర్భవించింది.

చెప్పుకోదగ్గ రైళ్లేవీ లేవు

కానీ, ఈ మార్గంలో ప్రయాణికుల రైళ్లు మాత్రం చెప్పుకోదగ్గవి ఏమీలేవు. ఢిల్లీ, కోల్‌కతా, విశాఖపట్టణం, వారణాసి, బెంగళూరు, చెన్నై, తిరువనంతపురం నగరాలకు రైళ్లు నడపాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మార్గంలో కేవలం రెండు పుష్‌పుల్ (డెమూ, మెమూ) ఎక్స్‌ప్రెస్ రైళ్లు, కాజీపేట నుంచి దాదర్ ముంబై వీక్లీ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్, తిరుపతి నుంచి కరీంనగర్ బై వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు మాత్రమే నడుస్తున్నాయి. ఈ మార్గంలో కోరుట్ల, మెట్‌పల్లి, ఆర్మూర్ లాంటి ఎక్కువ జనాభా కలిగిన పట్టణాలు కూడా ఉన్నాయి. భవిష్యత్తులో డబ్లింగ్ పూర్తయితే ఇటు ముంబై వైపు, అటు సికింద్రాబాద్ వైపు రైళ్ల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి. మరోవైపు అటల్ మిషన్ ఫర్ రిజునవేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌మిషన్ (ఏఎంఆర్‌యూటీ) పథకం కింద ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్‌కు రూ.26.6 కోట్లు, రామగుండంకు రూ.26.50 కోట్లు, పెద్దపల్లికి రూ.20 కోట్లు మంజూరయ్యాయి. అయితే, ఈ పనులను రెండు దఫాల్లో చేపట్టనున్న కేంద్రం.. తొలిదశలో కరీంనగర్, రామగుండం స్టేషన్లను అభివృద్ధి చేసి, మరికొన్ని నెలల్లోనే పెద్దపల్లిలోనూ పనులు ప్రారంభించనుంది.

ఉమ్మడి జిల్లా ప్రజలకు ఉపయుక్తం

చీకురాయి వద్ద రైల్వేస్టేషన్ నిర్మించతలపెట్టడం అభినందనీయం. రెండు మార్గాలు కలిసేచోట స్టేషన్ నిర్మించడం వల్ల మా ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతుంది. ఇది ఒక్క పెద్దపల్లి ప్రజలకే కాకుండా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల ప్రాంతాల ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

– మేకల శ్రీనివాస్, చీకురాయి

పార్టీయే బలం.. ప్రజలే బలగం

పార్టీ మా బలం.. నియోజకవర్గ ప్రజలే బలగం అంటున్నారు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు.. వచ్చే ఎన్నికల్లో పోటీచేసే బీఆర్‌ఎస్ అభ్యర్థులు. సీఎం కేసీఆర్ మమ్మల్ని అభ్యర్థులుగా ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. ఇంతవరకు ఎంతో అభివృద్ధి చేశామని.. మరిన్ని పనులు చేసేందుకు ప్రజలు మరో అవకాశం ఇవ్వాలని కోరారు. పార్టీ కార్యకర్తలు.. ప్రజల సహకారంతో విజయ బావుటా ఎగురవేస్తామన్నారు. అందరితో కలిసికట్టుగా పనిచేస్తూ తిరుగులేని గులాబీ సైన్యంగా ముందుకు సాగుతామని.. వచ్చేది తమదే సర్‘కారు’ అని పేర్కొన్నారు. ఇంకా వారేమన్నారో వారి మాటల్లోనే...

ప్రజల ఆశీర్వాదంతో గెలుస్తా



సిరిసిల్ల: సీఎం కేసీఆర్ నన్ను సిరిసిల్ల అభ్యర్థిగా ప్రకటించినందుకు ధన్యవాదాలు. కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేస్తాం. ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ గెలుస్తా. 2009 నుంచి సిరిసిల్ల ప్రజలు నన్ను నాలుగు సార్లు గెలిపించారు. వారిని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటా. నియోజకవర్గ ప్రజల దీవెనలతో భారీ మెజార్టీతో గెలుస్తా.

– కె.తారక రామారావు,

అభివృద్ధే ధ్యేయం



వేములవాడ: రాజన్న గుడి, వేములవాడ మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. ఇప్పటి వరకు పనిచేసిన రమేశ్‌బాబు నాయకత్వంలో భారీ మెజార్టీతో గెలుస్తాను. బీఆర్‌ఎస్ పార్టీలో వర్గపోరు లేదు. మేమంతా ఒకే కుటుంబం.

– చల్మెడ లక్ష్మీనరసింహారావు

మేనిఫెస్టోలో లేని పనులు చేశా..



కరీంనగర్: కరీంనగర్‌ను పదేళ్లల్లో వేలకోట్లతో అభివృద్ధి చేశాను. సీఎం కేసీఆర్‌కు కరీంనగర్‌పై ప్రత్యేక అభిమానంతో నిధులు కేటాయిస్తున్నారు. రూ.180 కోట్లతో తీగలవంతెన, రూ.410 కోట్లతో రివర్‌ఫ్రంట్ పనులు సాగుతున్నాయి. ఐటీటవర్, మెడికల్ కాలేజీ తదితరాలు పూర్తయ్యాయి. మేనిఫెస్టోలో లేని పనులు చేసి చూపించా. నాలుగోసారి విజయ బావుటా ఎగురవేస్తా.. –గంగుల కమలాకర్, మంత్రి

ప్రజారుణం తీర్చుకుంటా



మానకొండూరు: మూడోసారి భారీ మెజార్టీతో గెలిచి ప్రజలరుణం తీర్చుకుంటా. సీఎం కేసీఆర్ నాపై నమ్మకంతో రెండుసార్లు మానకొండూరు ఎమ్మెల్యేగా టికెట్ ఇచ్చారు. అందరి సహకారంతో అనేక అభివృద్ధి పనులు చేశాను. టిక్కెట్ ఇచ్చిన కేసీఆర్‌కు ధన్యవాదాలు. – రసమయి బాలకిషన్, ఎమ్మెల్యే

కేసీఆరే దైవం



చొప్పదండి: కేసీఆర్ దైవసమానులు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటా. కార్యకర్తలే నా బలం, బలగం. గత ఎన్నికల్లో 42 వేల మెజారిటీతో గెలిపించారు. ఐదేళ్లలో నియోజకవర్గాన్ని మరో కోనసీమగా చేశా..రూ. 150 కోట్లతో కొండగట్టు అభివృద్ధి జరుగుతోంది.

– సుంకె రవిశంకర్, ఎమ్మెల్యే

ఎగిరేది బీఆర్‌ఎస్ జెండానే..



హుజూరాబాద్: హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ గడిచిన రెండేళ్లలో నియోజకవర్గంలో తట్టెడు మట్టి కూడా పోయలేదు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఊహించనిస్థాయిలో అభివృద్ధి జరిగింది. ఈసారి ఇక్కడ ఎగిరేది బీఆర్‌ఎస్ జెండానే. మరోసారి కేసీఆర్ సీఎం కాబోతున్నారు. నన్ను గెలిపిస్తే రూ.వెయ్యికోట్లతో అభివృద్ధి పనులు చేస్తా. –పాడికౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ

‘హ్యాట్రిక్’ సాధిస్తా..



హుస్నాబాద్ ప్రజలు రెండు సార్లు ఆశీర్వదించారు. గడిచిన పదేళ్లలో నియోజకవర్గ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేశా. సీఎం కేసీఆర్ మరోసారి టికెట్ ఇచ్చినందుకు కృతజ్ఞతలు. ప్రజలు ఎంతో సహకరించారు. అదేస్ఫూర్తితో హ్యాట్రిక్ విజయం సాధిస్తాను.

– వొడితెల సతీశ్‌కుమార్,ఎమ్మెల్యే

అన్ని రంగాల్లో అగ్రస్థానం



గోదావరిఖని: రామగుండాన్ని అన్నిరంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దడమే లక్ష్యం. గడిచిన నాలుగున్నరేళ్లలో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు కృషిచేశా. గోదావరిఖనిలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, సీనియర్ సివిల్‌జడ్జి కోర్టు, విలీన గ్రామాలకు విముక్తి కల్పించాను. సీఎం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయను. –కోరుకంటి చందర్,ఎమ్మెల్యే

సంక్షేమం.. సామాజిక సేవ



మంథని: మంథనిని 40ఏళ్లు పాలించిన దుద్దిళ్ల కుటుంబం పేదవాడికి చెంచడు నీళ్లు పోయలేదు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలను అర్హులైన పేదవారికి చేరవేస్తున్నా. పేద కుటుంబంలో పుట్టిన తనపై నియోజకవర్గ ప్రజల అభిమానం, ఆశీస్సులు ఉన్నాయి. మరోసారి విజయం సాధిస్తా. – పుట్ట మధు

పెద్దపల్లికి గుర్తింపు తెస్తా



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి అగ్రగామిగా నిలుపుతా. ఇప్పటికే స్వచ్ఛసర్వేక్షణ్, హరితహారంలో రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందింది. పెద్దపల్లి– కూనారం రోడ్డులో రైల్వేవంతెన పనులు పురోగతిలో ఉన్నాయి.

– దాసరి మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్యే


కేసీఆర్ నాయకత్వంలో..



గొల్లపల్లి: కేసీఆర్ నాయకత్వంలో ఆరుసార్లు ఎమ్మెల్యేగా అవకాశం వచ్చింది. ప్రజలకు ఎంతో సేవచేశాను. ఇప్పుడు మరో అవకాశం ఇచ్చారు. ఈసారి కూడా ప్రజల ఆశీర్వాదాన్ని కోరుతున్నా. ప్రజలకు అందుబాటులో ఉండి, వారికి అన్నిరకాలుగా అండగా ఉంటా.

– కొప్పుల ఈశ్వర్, మంత్రి

సమస్యలు పరిష్కరిస్తా..



జగిత్యాల: అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తా. ఇప్పటికే జగిత్యాలలో మెడికల్ కాలేజీ, మున్సిపాలిటీ సుందరీకరణ, రోడ్డు వెడల్పు పనులకు కృషి చేశాను. ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటాను.

– సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే

నాన్నే స్ఫూర్తి..



కోరుట్ల: నాలుగు సార్లు ఎమ్మెల్యేగా కోరుట్ల అభివృద్ధికి కృషిచేసిన నాన్న విద్యాసాగర్ రావు స్ఫూర్తి. యువకుడిగా, వైద్యుడిగా నియోజకవర్గ అభివృద్ధిపై ప్రణాళికతో ముందుకెళ్తా. ప్రజల ఆశీస్సులతో విజయం సాధిస్తా. నాన్న చేసిన అభివృద్ధి పనులు నా గెలుపునకు దోహదపడతాయి.

– డాక్టర్ సంజయ్

క్లుప్తంగా

గుడి చెరువు పనుల్లో వేగం పెంచండి



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

వేములవాడ: వేములవాడ గుడి చెరువు సుందరీకరణ పనుల్లో వేగం పెంచాలని, అక్టోబర్ మొదటి వారంలోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాజన్న గుడిచెరువు అభివృద్ధి పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రూ.12 కోట్లతో పట్టణ ప్రజల సౌకర్యార్థం గుడి చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపడుతున్నామన్నారు. సాధ్యమైనంత ఎక్కువమందితో రెండు షిఫ్టుల్లో పనులు కొనసాగించాలని, బతుకమ్మ పండుగకు ముందే పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పనుల్లో జాప్యం జరగకుండా, గడువుకు ముందే పూర్తిచేసేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట వీటీడీఏ కార్యదర్శి సమ్మయ్య, ఎస్టేట్ అధికారి సత్యనారాయణ, తహసీల్దార్ మహేష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, పర్యాటక శాఖ ఏఈ అనూష, కాంట్రాక్టర్ సతీశ్, తదితరులు ఉన్నారు.

'ఆరోగ్య మహిళ'కు స్పందన

సిరిసిల్లటౌన్: జిల్లాలో ప్రతి మంగళవారం 'ఆరోగ్యమహిళ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు ప్రకటనలో తెలిపారు. సిరిసిల్లలోని పీఎస్‌నగర్, వేములవాడ పీఏసీ, నేరెళ్ల పీహెచ్‌సీ, తంగళ్లపల్లి పీహెచ్‌సీల్లో మహిళలకు ఉచితంగా వైద్యరోగ్య పరీక్షలు నిర్వహించారని పేర్కొన్నారు. ఆరోగ్య మహిళ శిబిరాల్లో ఓపీడీ 394, బ్రెస్ట్ 394, ఓరల్ కావిటీ 393, యూటీఐ 109, ల్యాబ్ 64, థైరాయిడ్ 40, విటమిన్ డీ 30, సీబీపీ 45, సూక్ష్మ పోషకాల పరీక్షలు 53 మందికి నిర్వహించి, వీరిలో ఇద్దరిని జిల్లాసుపత్రికి రెఫర్ చేసినట్లు వివరించారు.

అభ్యసన సామర్థ్యాలు పెంచాలి

బోయినపల్లి(చొప్పదండి): విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంచడానికి ఉపాధ్యాయులు ఉన్నతి కార్యక్రమాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాలని ఉన్నతి కార్యక్రమం రాష్ట్ర పరిశీలకుడు విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి సూచించారు. మండలంలోని కొదురుపాక ఉన్నత పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 6 నుంచి 9వ తరగతి వరకు ఉన్నతి, 10వ తరగతి విద్యార్థులకు లక్ష్య కార్యక్రమం సెప్టెంబర్ నుంచి అమలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఈవో రమేశ్‌కుమార్, క్వాలిటీ కో ఆర్డినేటర్ శైలజ, ఎంఈవో శ్రీనివాస్‌దీక్షిత్, హెచ్ఎం రంగనాథశర్మ, రిసోర్స్ పర్సన్స్ విఠల్‌నాయక్, శ్రవణ్‌కుమార్, రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పత్తిపాక చందనకు డాక్టరేట్



సిరిసిల్లకల్చరల్: జిల్లా కేంద్రానికి చెందిన ఉపాధ్యాయురాలు పత్తిపాక చందన డాక్టరేట్ పట్టాకు ఎంపికైంది. ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రాచ్య భాషా విభాగం హిందీ సాహిత్యంలో డాక్టరేట్ పట్టా అందుకుంది. ఈ మేరకు మంగళవారం వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రకటన విడుదల చేశారు. డాక్టర్ శ్యాంసుందర్ పర్యవేక్షణలో హిందీ బాల సాహిత్య, రాష్ట్రీయ పుస్తక్ న్యాస్ కే సందర్భమే అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్నట్లు వెల్లడించారు. చందన డాక్టరేట్ అందుకోవడంపై మానేరు రచయితల సంఘం ప్రతినిధులు డాక్టర్ నలిమెల భాస్కర్, రంగినేని మోహన్‌రావు, టీవీ నారాయణ, ఎలగొండ రవి, గరిపెల్లి అశోక్ కందేపి రాణీప్రసాద్, గెంట్యాల భూమేశ్, సిరిసిల్ల తిరుపతి, జిందం అశోక్, అనిత, చరణ్, బూర దేవానందం అభినందించారు.

హీటెక్కిన ఎములాడ

- రాజకీయం రసవత్తరం
- ఎమ్మెల్యే రమేశ్‌బాబు నిర్ణయం కోసం ఎదురుచూస్తున్న కార్యకర్తలు



సమావేశంలో నాయకులు

వేములవాడ/వేములవాడరూరల్: వేములవాడ రాజకీయం ఒక్కసారిగా హీటెక్కింది. సిట్టింగ్ ఎమ్మెల్యే రమేశ్‌బాబు స్థానంలో చల్మెడ లక్ష్మీనర్సింహారావు పేరును అధిష్టానం ఖరారు చేయడంతో స్థానికంగా రాజకీయ చర్చ జోరందుకుంది. ఎక్కడ నలుగురు కలిసినా పార్టీ టికెట్లు, పార్టీలు మారే యోచనలో ఉన్న నాయకుల గురించే చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ నుంచి రమేశ్‌బాబు అనుచరగణం జర్మనీ నుంచి ఆయన రాకకోసం ఎదురుచూస్తున్నారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థిగా మొదటి నుంచి ఆది శ్రీనివాస్ పేరు ఉండడంతో దాదాపు అధిష్టానం కూడా ఆయనకే టికెట్ ఇస్తున్నట్లు తెలిపింది. ఇక బీజేపీ అభ్యర్థి ఎవరనేది నియోజకవర్గంలో జోరుగా చర్చ జరుగుతోంది.

మా సారు నిర్ణయమే మా నిర్ణయం

జర్మనీ నుంచి రమేశ్‌బాబు ఈనెల 26న వచ్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. భవిష్యత్ ప్రణాళికలపై ఆయనతో చర్చించిన తర్వాత నిర్ణయాలు ప్రకటిస్తామని ఆపార్టీ నేతలు అన్నట్లు తెలిసింది. ఇప్పటికే తన అనుచరగణానికి సోషల్ మీడియా, పత్రికా ప్రకటన ద్వారా రమేశ్‌బాబు పలు సూచనలు చేసిన విషయం తెలిసిందే. మరో రెండు నెలలపాటు తాము ప్రజలకిచ్చిన వాగ్దానాలను నెరవేర్చేందుకు కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరముందని ప్రకటించారు. ఈనేపథ్యంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మంగళవారం రూరల్ మండల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ ఎమ్మెల్యే తీసుకున్న నిర్ణయానికే తాము కట్టుబడి ఉంటామని, ఇప్పుడు ఏమీ చెప్పలేమని నాయకులు, ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. కాగా అందరం కలిసి మూడోసారి సీఎంగా కేసీఆర్‌ను గెలిపించుకుందామని తోట ఆగయ్య వారికి వివరించినట్లు తెలిసింది. ఇక బీఆర్ఎస్ వేములవాడ అసెంబ్లీ అభ్యర్థిగా చల్మెడ నర్సింహారావు ఈనెల 21న తన పార్టీ కార్యాలయానికి చేరుకుని అందరినీ కలుసుకున్నారు. చాపకిందినీరులా ప్రముఖ నాయకుల ఇంటింటికీ వెళ్లి కలుస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ ఒకే కుటుంబమని, మూడోసారి కేసీఆర్‌ను సీఎం చేసేందుకు అంతా కలిసి రావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఆపార్టీ జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకత్వంతో టచ్‌లో ఉంటూ ఇక్కడి అంశాలను వివరిస్తున్నట్లు తెలుస్తోంది.

కలిసి పనిచేద్దాం

వేములవాడఅర్బన్: వేములవాడ మండల బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు మంగళవారం చింతల్‌ఠాణా గ్రామంలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య హాజరై మాట్లాడారు. పార్టీ అధిష్టానం నిర్ణయించిన అభ్యర్థికి మద్దతు తెలిపి, ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త ముందుండి గెలిపించాలని కోరారు. అనంతరం వేములవాడ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు సమావేశానికి హాజరయ్యారు. అసెంబ్లీ ఎన్నికలు వస్తున్నందున నాయకులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేసి భారీ మేజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ మ్యాకల రవి, సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తలు అవాస్తవం

వేములవాడ: పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న వార్తలు వాస్తవంకాదని వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు జర్మనీ నుంచి మంగళవారం 'సాక్షి'కి తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఈనెల 21న టికెట్లు ప్రకటించిన నేపథ్యంలో కొన్ని చానళ్లలో ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. కొద్ది రోజుల్లో తాను వేములవాడకు వస్తానని, తన అనుచరులతో చర్చిస్తానని పేర్కొన్నారు. మరో రెండు నెలల సమయంలో కలిసికట్టుగా ప్రజలకిచ్చిన వాగ్దానాలను నెరవేరుస్తానని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు ఇలాంటి దుష్ప్రచారాన్ని నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు.

కులవృత్తిదారులను ఆదుకోవడమే లక్ష్యం



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రసమయి

ఇల్లంతకుంట(మానకొండూర్): కులవృత్తిదారులను ఆర్థికంగా ఆదుకునేందుకే సీఎం కేసీఆర్ బీసీ బంధు పథకాన్ని ప్రవేశపెట్టి రూ.లక్ష సాయం అందించడం జరుగుతుందని మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 53 మందికి మంగళవారం బీసీ బంధు చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు.త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలు కైవసం చేసుకుని మూడోసారి కేసీఆర్ సీఎం అవుతారని పేర్కొన్నారు. ప్రజలందరూ ప్రభుత్వానికి వారధిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, వైస్ ఎంపీపీ శ్రీనాథ్‌గౌడ్, బీసీ సంక్షేమశాఖ కరీంనగర్ జిల్లా అధికారి అనిల్ ప్రకాష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ చింతలపల్లి వేణురావు తదితరులు పాల్గొన్నారు.

బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజ్

గంభీరావుపేట(సిరిసిల్ల): బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే ధీరజ్ అన్నారు. బీజేపీ చేపట్టిన ఎమ్మెల్యే ప్రవాస్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలకేంద్రంలోని మున్నూరుకాపు సంఘ భవనంలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సామాన్య కార్యకర్తలను కూడా బీజేపీ గుర్తిస్తుందన్నారు. కార్యకర్తలు అధైర్యపడొద్దని, అన్నివేళలా పార్టీ అండగా ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు కటకం మృత్యుంజయం, చక్రధర్‌రెడ్డి, కొక్కు దేవేందర్‌యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి, మండల అధ్యక్షుడు గంట అశోక్, జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ, నాయకులు శ్రీనివాస్, ఆడెపు రవీందర్, మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి, వాజిద్ హుస్సేన్, పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి బలం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): కార్యకర్తలే పార్టీకి బలమని కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, మండల అధ్యక్షుడు వెంకట్, నాయకులు పాల్గొన్నారు.

సభ విజయవంతం చేయాలి

గంభీరావుపేట(సిరిసిల్ల): మణిపూర్ మహిళలపై అకృత్యాలకు వ్యతిరేకంగా ఈ నెల 25న సిరిసిల్లలో ప్రజాప్రదర్శన సభ నిర్వహించనున్నట్లు తెలంగాణ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం తెలిపారు. సభకు సంబంధించిన ప్రచార పోస్టర్లను మంగళవారం మండల కేంద్రంలో విడుదల చేశారు.ప్రజాస్వామిక వాదులు, విద్యార్థులు, యువకులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు దోసల ఉపేంద్ర, మండల అధ్యక్షుడు లక్కం బాబు, లారీ అసోసియేషన్ అధ్యక్షుడు పిట్ల వెంకటి, దోసల శంకర్, జీడి రమేష్, మనోజ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిల ఐక్యతను ప్రభుత్వం గుర్తించింది

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ



నివాళి అర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ తదితరులు

సిరిసిల్ల: రెడ్డిల ఐక్యతను గుర్తించిన ప్రభుత్వం జిల్లా కేంద్రంలో ఐదెకరాల స్థలం, నిధులు మంజూరు చేసిందని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. సిరిసిల్లలోని లహరి గార్డెన్స్‌లో రాజా బహద్దూర్ వెంకటరామిరెడ్డి 154వ జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ, ఒక్క పిలుపుతోనే జిల్లా నలుమూలల నుంచి రెడ్డికులబాంధవులు తరలిరావడం విశేషమన్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వం నుంచి నిధులు సాధించి రెడ్డి సంక్షేమ భవనాన్ని నిర్మించాలన్నారు. రెడ్డి సంక్షేమం జిల్లా అధ్యక్షుడు కూర అంజిరెడ్డి మాట్లాడుతూ, రాజా బహద్దూర్ వెంకటరామిరెడ్డి చదువు గొప్పతనాన్ని గుర్తించి చాలా మందికి చదువు చెప్పించారని గుర్తు చేశారు. జిల్లా కేంద్రంలో ఆయన విగ్రహ ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందున్న ఎల్లారెడ్డిపేట సర్పంచ్ నేవూరి వెంకటరెడ్డికి జాతీయ స్థాయిలో అవార్డు రావడాన్ని హర్షిస్తూ సన్మానించారు. 10వ తరగతిలో 10 జీపీఏ, ఇంటర్‌లో మెరిట్ విద్యార్థులు 14 మందికి ప్రతిభా పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దూరి రాంరెడ్డి, మహిళా అధ్యక్షురాలు నేవూరి మమతారెడ్డి, కోర్ కమిటీ సభ్యులు పూర్మాని లింగారెడ్డి, ఏనుగు మనోహర్‌రెడ్డి, కనమేని చక్రధర్‌రెడ్డి, ఏసిరెడ్డి రాంరెడ్డి, పాతూరి మహేందర్‌రెడ్డి, పొన్నాల బాల్‌రెడ్డి, పాశం రాజేందర్‌రెడ్డి, రంగారెడ్డి, లక్ష్మారెడ్డి, కమలాకర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, ప్రమోదరెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

పింజర్ల డబ్బు కోసం ఆసాముల దీక్ష



దీక్షలో ఆసాములు

సిరిసిల్ల: సిరిసిల్లలోని పాలిస్టర్ అసోసియేషన్ ఆఫీస్ ముందు ఆసాములు మంగళవారం దీక్షలు చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. 2021 నాటి పింజర్ల సబ్సిడీ డబ్బులు నెల రోజుల్లో ఇస్తామని చెప్పి యజమానులు మాట తప్పారని ఆరోపించారు. పింజర్ల పైసలు వచ్చేవరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. నిరసనలో భాగంగా బుధవారం వంటావార్పు నిర్వహిస్తామని పేర్కొన్నారు. దీక్షల్లో ఆసాముల ప్రతినిధులు సిరిసిల్ల రవీందర్, చేరాల అశోక్, మండల రాజు, ఆడెపు భాస్కర్, మంతెన రవి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు అకౌంట్లు ఇవ్వండి

సిరిసిల్లలో 2021లో బతుకమ్మ చీరలు ఉత్పత్తి చేసిన ఆసాముల బ్యాంకు అకౌంట్ వివరాలు అందించాలని చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకుడు సాగర్ ప్రకటనలో కోరారు. మ్యాక్స్ సంఘాల అధ్యక్షులు, ఎస్ఎస్ఐ యూనిట్ల యజమానులు 2021లో ఆసాములు నడిపించిన (ఉత్పత్తి చేసిన) బతుకమ్మ చీరల బట్ట మీటర్లు, పింజర్ల వివరాలను నిర్దిష్టమైన ఫార్మెట్‌లో సిరిసిల్ల చేనేత, జౌళిశాఖ ఆఫీస్‌లో బుధవారం అందించాలని కోరారు.

'మభ్యపెట్టే ప్రభుత్వాన్ని గద్దె దించాలి'



నిరసన తెలుపుతున్న ఆది శ్రీనివాస్, నాయకులు

రుద్రంగి(వేములవాడ): మభ్యపెట్టే ప్రభుత్వాన్ని గద్దె దించాలని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం రుద్రంగి శివారులోని సూరమ్మ ప్రాజెక్టు వద్ద నాయకులతో కలిసి నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2018 ఎన్నికల సమయంలో సూరమ్మ ప్రాజెక్టుకు భూమిపూజ చేసి అదే సంవత్సరం దసరా వరకు పనులు పూర్తి చేసి కుడి, ఎడమ కాలువల ద్వారా కథలాపూర్, మేడిపెల్లి మండలాలకు సాగు నీరందిస్తామని చెప్పిన నాయకులు ఐదేళ్లు గడిచినా తట్టెడు మట్టి తీయకుండా రెండు మండలాల రైతులను మోసం చేశారని ఆరోపించారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం అనేక రకాలుగా నిరసనలు తెలిపినా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. సాక్షాత్తు సీఎం కేసీఆర్ కథలాపూర్ రైతులకు ఫోన్ చేసి అదెంతపని వెంటనే చేస్తామని మభ్యపెట్టి మూడేళ్లు గడుస్తుందన్నారు. మభ్యపెట్టే నాయకులను నమ్మకుండా కాంగ్రెస్‌ను గెలిపిస్తే 18 నెలల్లోనే సూరమ్మ ప్రాజెక్టుతో పాటు కుడి ఎడమ కాలువలు పూర్తి చేసి రైతులకు సాగు నీరందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అరుణాచలం తీర్థయాత్రకు ఆర్టీసీ ఆఫర్

సిరిసిల్లటౌన్: తమిళనాడులోని అరుణాచలం క్షేత్రంలో ఆగస్టు 29న శ్రావణపౌర్ణమి పురస్కరించుకుని గిరి ప్రదక్షిణ కోసం ఆర్టీసీ బంపర్ ఆఫర్ ప్రకటించింది. వేములవాడ నుంచి అరుణాచలం తీర్థయాత్రకు సూపర్ లగ్జరీ బస్‌ను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ మురళీకృష్ణ మంగళవారం ప్రకటించారు. 75555 నంబరు గల బస్సు వేములవాడ నుంచి ఆగస్టు 29న రాత్రి 8గంటలకు బయలుదేరి కరీంనగర్ మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకం, నెల్లూరు క్షేత్రాలను సందర్శిస్తూ, 30న రాత్రి 8గంటలకు అరుణాచలం చేరుకుంటుందన్నారు. తిరుగుప్రయాణం ఆగస్టు 31 సాయంత్రం 5 గంటలకు ప్రారంభమై ఉదయం ఆలంపూర్ జోగులాంబ క్షేత్రం చేరుకుంటుందని, దర్శనం తర్వాత అదే రోజు సాయంత్రం 6 గంటల వరకు వేములవాడ చేరుకుంటుందన్నారు. అరుణాచలం గిరి ప్రదక్షిణకు ఒక్కొక్కరికి పెద్దలకు రూ.4,500, పిల్లలకు రూ.3,400 టిక్కెట్ ధర ఉంటుందన్నారు. టికెట్స్ బుకింగ్ కోసం వెబ్‌సైట్ tsrtconline.inలో ముందస్తుగా బుక్ చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 99592 25926, 73828 51826 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

ఇసుక వాహనం పట్టివేత

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామ శివారులోని మానేరువాగు నుంచి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న పికప్ వాహనాన్ని మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై రమాకాంత్ కథనం ప్రకారం.. రాచర్లగొల్లపల్లి శివారులో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు ఇసుక లోడ్‌తో వస్తున్న పికప్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు తెలిసింది. వాహనాన్ని స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. పదిరకు చెందిన యజమాని గండికోట మల్లేశ్, డ్రైవర్ గండికోట వేణులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల) : మండల కేంద్రానికి చెందిన ఎరుపుల మహేశ్(32) మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతుండడంతో కుటుంబ సభ్యులు మందలించగా, మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు.. మహేశ్ కూలీ పనులు చేసుకుంటూ భార్య, ఇద్దరు కూతుళ్లను పోషించుకుంటున్నాడు. కొంతకాలంగా మద్యానికి అలవాటుపడి వచ్చే కూలీ డబ్బులతో మద్యం సేవిస్తూ డబ్బును వృథాగా ఖర్చు చేస్తున్నాడు. ఈ విషయంలో కుటుంబ సభ్యులు సోమవారం మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన మహేశ్ అదే రోజు సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ప్రియుడి ఇంటిముందు బైఠాయింపు

కోనరావుపేట(వేములవాడ): తనను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మాటిచ్చి ఇప్పుడు కాదంటున్నాడని ఆరోపిస్తూ ఓ యువతి అదే గ్రామానికి చెందిన యువకుడి ఇంటి ముందు బైఠాయించింది. బాధితురాలి కథనం ప్రకారం.. నిమ్మపల్లికి చెందిన కరుణాకర్, ఇంటి పక్కనే గల యువతి పదేళ్ల నుంచి ప్రేమించుకుంటున్నారు. ఇప్పుడు పెళ్లి చేసుకోవాలని అడిగితే తాను వేరే అమ్మాయిని పెళ్లి చేసుకున్నానని చెబుతున్నాడని, తనకు న్యాయం చేయాలని బాధితురాలు కోరారు. కోనరావుపేట ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి బాధితురాలితో మాట్లాడారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చి యువతిని ఇంటికి పంపించారు.

విద్యార్థిని అదృశ్యం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని (18) స్థానిక పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. సోమవారం టైలరింగ్ షాపునకు వెళ్లి తిరిగిరాలేదు. రెండు రోజులు గాలించినా ఫలితం లేకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ వివరించారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల బైపాస్ రోడ్డులో మంగళవారం రాత్రి బైక్ అదుపుతప్పి ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల వివరాలు.. సిరిసిల్లలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన అభి, వాసు బైక్‌పై సిరిసిల్ల బైపాస్ మీదుగా రగుడు జంక్షన్ వైపు వెళ్తున్నారు. స్పీడ్‌లో ఉన్న బైక్ అదుపు తప్పింది. ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వాసు పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ పంపించారు.

అసమ్మతి నేతల సమావేశం

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడితో రాత్రి వరకు చర్చలు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ పట్టణ బీఆర్ఎస్ శ్రేణుల అసమ్మతి రాగం పక్క మండలాలకు పాకకముందే అధిష్టానం దిద్దుబాటు చర్యలకు దిగింది. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు డాక్టర్ చంద్రశేఖర్‌రావు అసమ్మతి నాయకులను ఏకతాటిపైకి తీసుకువచ్చి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యతో ముస్తాబాద్‌లో సోమవారం అర్ధరాత్రి వరకు సమావేశం నిర్వహించినట్లు తెలిసింది. ఏఎంసీ చైర్మన్ పదవి పట్టణ నాయకులకే ఇవ్వాలని లేకుంటే మూకుమ్మడి రాజీనామా చేస్తామన్న నాయకుల తీర్మానంతో.. మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు డాక్టర్ చంద్రశేఖర్‌రావు, ఆగయ్య వారితో చర్చించారని సమాచారం. పార్టీలో సీనియర్‌గా ఉండి ఉద్యమంలో పనిచేసిన ముస్తాబాద్ పట్టణ నాయకులకు ఏఎంసీ చైర్మన్ ఇవ్వాలన్న డిమాండ్‌తో ఒకే మాటపై నిలబడి మంత్రి కేటీఆర్ దృష్టిని ఆకర్షించారు. పట్టణంలో బీఆర్ఎస్ నాయకులకు ఎలాంటి పదవులు ఇవ్వడంలేదని, పార్టీలో ప్రాధాన్యత కల్పించకుండా, కేవలం కొంత మంది ఆధిపత్యం కోసం తమను బలిపశువులను చేస్తున్నారని ఆగయ్య ముందు గోడు వెళ్లబోసుకున్నారని తెలిసింది. ప్రధాన నాయకులకు రెండేసి పదవులు ఉన్నాయని తమ పరిస్థితి ఏంటో చెప్పాలని కోరినట్లు సమాచారం. కష్టపడే వారికి ఏం చేశారో చెప్పాలని కోరారు. అయితే ఆగయ్య, మంత్రి పీఏలు గణరాజు, మహేందర్‌రెడ్డి అసమ్మతి నేతలతో మాట్లాడేందుకు ముస్తాబాద్‌కు రాగా, ఎవరు వారికి అందుబాటులోకి రాలేదని తెలిసింది. దీంతో చంద్రశేఖర్‌రావు హామీ మేరకు అసమ్మతి నాయకులు సమావేశమై ఆగయ్యతో చర్చించి బాధలు చెప్పుకున్నట్లు సమాచారం. ప్రధాన నాయకులు వస్తే సమావేశం బహిష్కరిస్తామని మాజీ సర్పంచ్ పేర్కొన్నట్లు.. ఓట్ల సమయంలోనే తాము గుర్తుకు వస్తున్నామని, ప్రభుత్వ పథకాల ఎంపికలో తమకు కనీస సమాచారం ఇవ్వడంలేదని అన్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, ముస్తాబాద్‌తోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో కొంత మంది అసమ్మతి బీఆర్ఎస్ నాయకులు మంగళవారం తలపెట్టిన సమావేశాన్ని వాయిదా వేయాలని ఆగయ్య కోరినట్లు తెలిసింది. మంత్రి కేటీఆర్ దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కరిస్తామని, ఎవరూ తొందర పడవద్దని జిల్లా అధ్యక్షుడు కోరడంతో అసంతృప్త నేతలు శాంతించారు.

డిగ్రీ కళాశాలను తరలించొద్దు



ధర్నా చేస్తున్న విద్యార్థులు, నాయకులు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఇక్కడి నుంచి సిరిసిల్లకు తరలించాలని కుట్ర చేస్తున్నారని, కళాశాలను తరలిస్తే ఉద్యమం తీవ్రతరం చేస్తామని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ అన్నారు. మంగళవారం కళాశాల గేటు ఎదుట, సిరిసిల్ల– వేములవాడ రహదారిపై విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అగ్రహారం డిగ్రీ కళాశాలను తరలింపు పేరుతో ఎత్తి వేయడానికి ప్రభుత్వం కుట్ర చేస్తుందని, ఇక్కడ 600 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని వివరించారు. ఈ కళాశాలలో మూడేళ్ల క్రితం జేఎన్‌టీయూ క్యాంపస్ ఏర్పాటు చేశారని, అందులో ఇప్పటికే రెండు బ్యాచ్‌లు నడుస్తుండగా ఈ ఏడాది మరో బ్యాచ్ ప్రారంభం కావడంతో డిగ్రీ కళాశాలను ఎత్తివేయాలని కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. అవసరమైతే జేఎన్‌టీయూ కోసం అదనంగా గదులు నిర్మించి మౌలిక వసతులు కల్పించాలన్నారు. 25 ఏళ్ల నుంచి నడుస్తున్న కళాశాలను తరలించడం సరికాదన్నారు. కళాశాలను తరలిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. ధర్నాలో విద్యార్థులు కావ్య, సంజన, భవాని, యమున, హర్ష, రాజేశ్, సాయి చరణ్, వెంకటేశ్, అఖిల్, మధు, రాకేశ్, శేఖర్, బాలకృష్ణ, తేజ, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రంలో ఏడు పార్టీలు అగ్రవర్ణాలవే'



జెండా ఆవిష్కరణలో విశారదన్ మహారాజ్

సిరిసిల్లఎడ్యుకేషన్: రాష్ట్రంలో ఏడు పార్టీలు అగ్రవర్ణాలవేనని ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆరోపించారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగిన డీఎస్‌పీ జిల్లా ఆవిర్భావ సభలో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సిరిసిల్లలో ఒక్క శాతం లేని వెలమ దొరల రాజ్యం కొనసాగుతుందని, 99 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలు సిరిసిల్ల నుంచి ఎమ్మెల్యేలు కావాల్సిందన్నారు. తెలంగాణలో 10శాతం లేని అగ్రకులాల పాలనకు స్వస్తి పలికి బహుజన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుందామన్నారు. మన ఓటు మన ప్రభుత్వం నినాదంతో సబ్బండ కులాలన్నీ ధర్మ సమాజ్ పార్టీతో కలిసి రావాలన్నారు. పేదలను పాలక ప్రభువులుగా చేయడానికే ధర్మ సమాజ్ పార్టీ శాఖను జిల్లాలో ప్రారంభిస్తున్నామని తెలిపారు. జిల్లా కేంద్రంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. డీఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు గంగారం, పరమేశ్వరి, బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు పాల్గొన్నారు.



బోనమెత్తిన భక్తులు

వేములవాడ: రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. డప్పు చప్పుళ్ల మధ్య నెత్తిన బోనాలతో విన్యాసాలు చేస్తూ అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. కల్లుసాక, ఒడిబియ్యం సమర్పించారు. నెత్తిన బోనాలతో ఆలయ ఆవరణలో గంటల తరబడి వేచి చూశారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు.